# మరో సాయంత్రం

లేదు.

ఉన్నాడనుకొని వెళ్ళాను; లేదు.

బయట కెక్కడికో వెళ్ళాట్ట – ఒక గంటలో వస్తానని.

వాళ్ళు పేకాడుతున్నారు. వాళ్లిద్దరే కూచుని సీరియస్‌గా ఆడుతున్నారు రంగారావుగారూ, అతనూ – అతనెవరు? ఎప్పుడూ చూళ్ళేదు. కృష్ణారావు స్నేహితుడో, చుట్టమో, ఎవరో? ఎవరైనా కావచ్చు. అదో పెద్ద సత్రం. బ్రహ్మచారి కొంప. ఎవరైనా వస్తూంటారు... పోతుంటారు.

ఐదున్నరయింది.

పేకాటలో జాయినౌదామని లేదు. వాళ్ళ ఆట చూద్దామని కూడా లేదు.

టేబిల్ మీద డెయిలీ పేపర్లు... ఇంగ్లీషువీ, తెలుగువీ... వీక్లీలు... మంత్లీలు.. సినిమా పత్రికలు... టేబిల్ నిండా కాయితాలు; ఫైళ్ళు.. కాలెండర్లు... పేపర్ వెయిట్లు... పిన్‌కుషన్.

టెలిఫోన్ ఎర్రగా వుంది. టెలిఫోన్ ఎర్రగా వుంటే ఎందుకో బాగుండదు; నల్లదే బావుంటుంది... లేదా మరో రంగు.. ఎక్కడికైనా టెలిఫోన్ చేస్తే... ఎక్కడికో చోటికి... ఎవరితోనైనా కాస్సేపు మాట్లాడితే... టెలిఫోన్ తాళం వేసివుంది.. తాళం చెవి ఎక్కడుందో... జేబులో వేసుకుపోయుంటాడు. తలుపులకో, పెట్టెలకో, బీరువాలకో వేసినట్టు టెలిఫోన్‌కి తాళం వెయ్యటమేమిటో..? సిల్లీ..! ఏం చేస్తాడు? ఫోన్ కాల్స్ రేట్లు బాగా పెరిగిపోయాయట. చీకటి పడుతోంది. గదిలో వేడిగా వుంది. ఉక్కగా వుంది. కరెంటుందో లేదో... లైట్ వెలిగింది.. కరెంటింకా పోలేదే...? రోజూ ఈ పాటికి పోతోంది.

పాత దిన పత్రిక కొత్త ఎడిషన్. సిటీ నుంచి... మొదటి సంచిక, ప్రధాన మంత్రి; రాష్ట్రపతి; కేంద్ర మంత్రులు; రాష్ట్ర మంత్రులు. ఇంకా ఎందరో ప్రముఖుల

సందేశాలు.. ఫోటోలు.. సంతోషం... శుభాకాంక్షలు... సంతోషం; హృదయ పూర్వకమైన అభినందనలు. మీ పత్రిక చాలా గొప్పది... చాలా పాతది... సంతోషం... శుభాకాంక్షలు... కవులు... అభినందన కవితలు... పేజీలనిండా ఎడ్వర్టయిజ్‌మెంట్లు.

పేకాడబుద్ధి కావటం లేదు.

లేచి బయటికీ లోపలికీ, ఆ గదిలోకీ, ఈ గదిలోకీ తిరిగాను. తోచటం లేదు. ఏం తోచటం లేదు.

చుట్టుపక్కల ఇళ్ళల్లో... గదుల్లోపల, పైన, కింద... మూల గదుల్లో... లైట్లు వెలిగాయి... వెలుగుతున్నాయి. బయటికి వెళ్ళి డాబామీంచి చూస్తే చుట్టూ ఇళ్ళల్లో గదుల్లో దీపాలు...? బావుంది... బావుందా...? బావుందనుకుంటాను.

బయట చల్లగా వుంది... చీకటి పడింది.

మళ్ళీ లోపలికి... సినిమా పత్రిక... హిందీ సినిమాల గురించి రాసే ఇంగ్లీషు పత్రిక. ఒక పెద్ద స్టార్‌తో ఇంటర్వ్యూ... వర్తిది.. ఆమెతో నాకేమీ సంబంధం లేదు. మేం స్నేహితులం.. అంతే.. పాపులర్ ఆడతార.. స్విమ్మింగ్ సూట్లో.. బికినీలో.. చీరలో.. చీరలో ఘోరంగా వుంది... నేను అసభ్యచిత్రాల్లో నటించను... స్టేట్‌మెంట్.. నాకు నూడిటీ, కిస్సింగ్ ఇష్టముండదు.. సినిమాల్లో... మన సంస్కృతి... ఒక పెద్ద ప్రొడ్యూసర్ డైరెక్టర్ ఇచ్చిన పార్టీకి – కొత్త తార సీ త్రూ డ్రెస్‌లో వచ్చింది.. వార్త; చాలా వార్తలు... ఫోటోలు... కలర్; కలర్ ఫోటోలు.. కొత్త సినిమాలు.. గదిలో కూర్చోడం దుర్భరంగా వుంది.

"స్టేక్ ఎంత సార్?"

"ఫైవ్ టెన్సండీ... ఆడతారా?"

"అమ్మో..! నేనాళ్ళేను.. మీరాడుకోండి."

"గంటలో వస్తానని వెళ్ళాడు. రెండు గంటలయింది. ఇంకా రాలేదు."

మళ్ళీ వాళ్ళిద్దరూ ఆటలో మునిగి పోయారు.

అవును. కృష్ణారావింకా రాలేదు. ఎక్కడికెళ్ళాడో?

నాకెందుకు..? ఇంకా రాలేదు.. రాకపోతే ఏం..? నాకతనితో పనేముంది? ఏంలేదు.. వూరికే, ఏం తోచక యిలా వచ్చాను.

తెలుగు వీక్లీ.. తెలుగు సినిమా పత్రికలు.. ఫోటోలు.. వార్తలు.. వ్యాఖ్యలు సమీక్షలు.. ఘోరం.. అచ్చయినా అందంగా వెయ్యకపోతే ఎలా..? ఏమిటీ సినిమాలు..? ఏమిటీ కథలు..? ఘోరం..? ఏమిటీ పత్రికలు..? చెత్త.. ట్రాష్..! మళ్ళీ బయటికి.

గాలి మరికాస్త చల్లబడింది...! ప్రాణానికి కాస్త హాయిగా వుంది. హాయిగావుందా..? ఏమో..! ఏమిటీ వెలితి..? లోపల ఏమిటీ ఖాళీ..? ఏమిటీ శూన్యం విచారమా..? కాదు.. బాధా..? కాదు.. కాదనుకుంటాను.. ఏమిటీ మూడ్..? ఏమిటో...! ఏమిటో...! ట్రాన్సిస్టర్ చిన్నది.. పాకెట్ సైజు.. చాలా చిన్నది.. సాయంత్రపు ప్రసారం ప్రారంభమైంది. అప్పుడే మొదటి పాట సగమైంది. పాట అయిపోయింది. ఎరువులు వాడండి. టూత్ పేస్టు.. సబ్బులు.. బిస్కట్లు.. మళ్ళీ పాట; ఎనౌన్స్‌మెంట్.. లేడీ ఎనౌన్సర్ గొంతులో వయారాలు.. ఈ ఎనౌన్సర్ వాయిసంటే ఎలర్జీ.. గొంతులో కృత్రిమత.. లాటరీ టిక్కెట్లు.. మరువకండి.. ఆఖరు తేదీ.. కొత్త సినిమా.. మీ అభిమాననటుడు.. మళ్ళీ పాట.. పాట బాగానే వుంది.. రొమాంటిక్‌గా వుంది. తియ్యటి మాటలు.. రొమాంటిక్‌గా తియ్యగా వుంటే మంచి పాటవుతుందా? కాదు.. కాదేమో..! సబ్బు.. తామర, దురద, కుటుంబనియంత్రణ.. పొదుపు.. పొదుపు చెయ్యండి. బాంక్‌లో దాచుకోండి.. వడ్డీ.

రోడ్డుకవతలిపక్క ఎదురుగా వున్న బిల్డింగ్‌లో.. కింద స్థలంలో.. ఇద్దరమ్మాయిలు షటిల్ కాక్.. వాళ్ళిద్దరూ అక్కచెల్లెళ్ళా..? ఏమో.. అలా లేరు. పక్కనే ఇంకో ఆవిడ కుర్చీలో.. చేతిలో పత్రిక.. తెల్లచీర.. ఒక పక్కన కుక్క.. గేటు మూసి వుంది. ఇరుకు.. ఆ యిరుకులోనే ఆటలు – విశ్రాంతి... వాళ్ళంతా ఒక పోర్షన్ వాళ్ళేనా..? ఏమో..! మొత్తం ఎన్ని పోర్షన్లున్నాయో..? కాక్ మాటిమాటికీ బయటికొచ్చి పడుతోంది; చిన్నమ్మాయి నల్లటమ్మాయి.. మాటిమాటికీ గేటు తెరుచుకుని వచ్చి తీసుకుని, లోపలికి వెళ్ళి మళ్ళీ గేటు మూసి.. మళ్ళీ ఆడి.. కుక్క కదలటంలేదు.. పెద్దదే.. అల్సేషియన్‌లా వుంది.

కుక్కల్ని పెంచటం కూడా చాలా కాస్ట్లీ అట. అసలెందుకో పెంచటం.. మనుషులకే తిండిలేక చస్తుంటే..?

రోడ్డుమీద పల్చపల్చగా జనం.. విడిగా.. జంటలుగా.. గుంపులుగా.. సైకిళ్ళ మీద.. రిక్షాల్లో.. ఆటో రిక్షాల్లో.. టాక్సీల్లో, సొంత కార్లలో..

మళ్ళీ లోపలికి.. ఇంకా అలానే ఆడుతున్నారు. గదిలో వేడి అన్‌బేరబుల్‌గా వుంది. కరెంటింకా పోలేదు..

"బయటికొచ్చి హాయిగా రెండు కుర్చీ లేసుకుని ఆడుకోకూడదూ..?" సలహా యిచ్చాను. మంచి సలహా యిచ్చాను. వరండాలో గాజు పెట్టెలో.. గాజు తొట్టిలో.. చేపలు.. చేపలు.. కొన్ని రంగువి. తిరుగుతున్నాయి.. పైకీ కిందికీ ఆ పక్కకీ ఈ పక్కకీ రెస్ట్‌లెస్‌గా ఈదుతున్నాయి. అవి ఆనందంగా వున్నాయా..? ఏమో..!

వాటికసలు ఆనందం, విచారం ఇలాంటి వుంటాయా.. వుండవు.. వుండవనుకుంటాను.. తొట్టి పక్కన గాజు ప్లేట్లో వానపాములు కాబోలు.. వానపాములేనా..? చిన్నవి.. సన్నవి.. దారాల్లా.. గుట్టగా.. ముద్దగా.. చేపలకి తిండి.. కొన్ని కదులు తున్నాయి.. మిగతావి ముద్దగా.. చచ్చినట్టున్నాయి. వాసన.. వానపాము రైతుకి మిత్రుడు.. చిన్నప్పుడు సైన్సు పుస్తకం.. కాలేజీలో వానపాము.. డిసెక్షన్.. వానపాములో ఆహారనాళిక.. వానపాముకి ఆకలేస్తుందా..? మళ్ళీ బయటికి.. రేడియోలో పాటలై పోయాయి.. వార్తలు.. బోర్.. బోర్...!

వెనక పక్క ఇంట్లో.. వరండాలో మంచం మీద బోర్లా పడుకుని పసిపిల్ల కేరింతలు.. ఆరుబయట.. చిన్నపిల్లల ఆటలు.. పసిపిల్లల మనసులో ఏముంటుందో..? చేపల్లా వాళ్ళకీ ఆనందం, విచారం వుండవా...? మరి ఏడుస్తారే.. నవ్వుతారే.. చేపలూ పసిపిల్లలూ ఒకటి కాదు; కాదు...!

ఆ యింటి వెనక.. ఇంకా వెనక – ఎత్తయిన మేడలో పైగదిలో లైటు.. పసిపిల్లనో, పసిపిల్లడినో ఎత్తుకుని ఒకావిడ.. తెల్లచీర.. ఇంకో ఆవిడ.. ఒక కుర్రాడు.. ఒక పెద్దాడు.. ఒక పిల్ల.. పనిపిల్ల.. కాఫీ.. విండో.. పెద్ద విండో... బెడ్ – కూర్చుంటున్నారు.. లేస్తున్నారు... తిరుగుతున్నారు.. గది బావుంది. ఎన్ని గదులో.. అద్దె ఎంతో...?

నా జన్మలో మంచి యిల్లు కట్టుకోగలనా..? అసలు సొంత యిల్లంటూ ఒకటి కట్టుకోగలనా..? ఏమో..! అద్దె కొంప.. అసహ్యం.. పాతయిల్లు.. పాతగోడలు.. అసలది ఇల్లా..? ఒక అందమా, చందమా? తప్పదు.. తప్పదు.. కాలక్షేపం.. కక్కుర్తి.. జీతం చాలదు. మంచి యిల్లు రాదు. వాడు ఇల్లు కట్టాట్ట – ఎనభై వేలట.. అమ్మో.. నేనెక్కణ్ణించి తేను..? వాడెక్కణ్ణించి తెచ్చాడు..? ఏమో..! నావల్ల కాదు..!

ఎదురుగా రోడ్డు కవతల పక్క కాస్త ఎడంగా ఆడపిల్లల కాలేజీ హాస్టల్.. కాలేజీ ఆడపిల్లల హాస్టల్.. కనబడటం లేదు. బిల్డింగ్ ముందున్న చెట్లు మాత్రం కనిపిస్తున్నాయి. కనబడితే బావుండును.

ఎవరి గదుల్లో వాళ్ళు.. కిటికీల వెనక.. రోడ్డు మీదికి చూస్తూ.. రోడ్డు మీది వాళ్ళని చూస్తూ.. చదువుకుంటూ.. అలంకరించుకుంటూ, కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుతూ.. వాళ్ళల్లో ఎంతమంది; ఎన్నిరకాలో.. అభిమానతార గురించి చర్చలు.. లెక్చరర్‌మీద జోకులు.. మగపిల్లల గురించి రహస్యాలు.. సెక్స్ పత్రికలు.. రంగుల కలలు.. భయాలు.. కడుపొస్తుందేమో.. ఇంటి దగ్గర్నించి యింకా యంవో, రాలేదు; బావ ఎక్కడున్నాడో, ఈ సబ్జక్ట్ నా ప్రాణాలు తీస్తోంది. దానికెందుకూ నేనంటే అంత ఏడుపు..? స్లీపింగ్ పిల్స్ దొరికితే బాగుండును; ఈ జన్మకి నాన్న నాకిక పెళ్ళిచెయ్యడు; కాళ్ళమీద ఈ వెంట్రుకలేమిటి అసహ్యంగా.. ఎలా వదిలించుకోవటం?

రోడ్డుమీద ఎవరో నలుగురైదుగురు అమ్మాయిలు త్వరత్వరగా నడుస్తున్నారు; హాస్టల్లో వాళ్ళేమో.. కాదేమో.. ఎక్కడికో, సినిమాకా.. ఇప్పుడేం సినిమా..? బావున్నారు.. బావున్నారు.. బావున్నారా.. ఏమో.. చీకట్లో సరిగా కనిపించటం లేదు.. మరీ చీకటిగా ఏం లేదు.. లైట్లున్నాయి.

ఎదురుగా దూరాన నిద్ర గన్నేరు చెట్టు వెనకాల.. ఏమిటది – చంద్రబింబమే..? ఎవడు వాడు.. చంద్రుడా..? ఓహో ఇవ్వాళ పౌర్ణమి కాబోలు.. అవునవును పౌర్ణమే.. ఎంత బావుంది దృశ్యం..! ఆకాశం.. గుబురుగా చెట్టు.. చెట్టు వెనకాల చంద్రుడు.. నిండు చంద్రుణ్ణి చూసి ఎన్నాళ్ళయిందో..! అసలీ సిటీ కొచ్చాక పౌర్ణ మెప్పుడో, అమావాస్య ఎప్పుడో తెలుస్తోందా..? లేదు.. తెలీదు – వెన్నెల కనబడుతోందా – లేదు.. సూర్యోదయం చూసి ఎన్నాళ్ళయింది..? ఏమో..!

సిటీకొచ్చి చాలామిస్సయ్యాను.. చాలా అందాలు.. చాలా అనుభవాలు.. మిస్సవుతున్నాను. ఇలాంటి సమయంలో పల్లెటూళ్ళో పొలంగట్టుమీదో, రోడ్డు పక్క ఏ వంతెనమీదో, ఏ కాలవగట్టు మీదో కూర్చుంటే ఎంత బావుంటుంది? ఇలాగే దూరాన చెట్ల చాటునుంచి పైకొచ్చే చంద్రుడు.. చల్లటిగాలి.. ఇంతకి వందరెట్లు స్వచ్ఛమైన గాలి.. ఎక్కడో ఎడ్ల మువ్వల చప్పుడు.. మసక చీకటి.. గట్టుమీద మోపు నెత్తి నెట్టుకుని నడిచే మనిషి.. తాటి చెట్టుమీద కొంగలు వాలి సర్దుకోటం.. అస్పష్టంగా వూళ్ళోని శబ్దాలు.. దీపాలు.. గొడ్ల అరుపులు.. ప్రశాంతతని భంగపర్చని చిన్న చిన్న శబ్దాలు.. ఎంత బావుంటుందెంత బావుంటుంది!

వాళ్ళు కూడా బయటికొచ్చారు. కుర్చీలు తెచ్చుకున్నారు. టీపాయ్ తెచ్చుకున్నారు.. దానిమీద ముక్కలు పర్చుకుని ఆడుతున్నారు.

"ఏం సార్, మీరూ ఆడతారా?"

"లేదు.. లేదు.. మీరాడుకోండి.."

రోడ్డుమీద రెండు కుక్కలు.. స్ట్రీడాగ్స్.. బుర్ర నిండా స్ట్రీథాట్స్.. స్ట్రీడాగ్స్‌ని పట్టుకుంటారు, చంపేస్తారు.. స్ట్రీథాట్స్‌ని పట్టుకోడమెలాగ.. చంపడమెలాగ.. కనీసం అరికట్టడమెలాగ?

దోమల్ని అరికట్టాలంటే.. వాడండి.. అది వాడండి.. ఇది కొనండి.. అది తాగండి.. ఇది తినండి.. మళ్ళీ రేడియోలో పాటలు.. ఈ సారి హిందీ పాటలు.. రోటీ, కపడా ఔర్‌మకాన్..

ఈ దేశం ఎప్పటికైనా బాగుపడుతుందా? మనుషులందరికీ తిండీ బట్టా నీడా దొరుకుతాయా? 'నిజంగానే నిఖిలలోకం నిండు హర్షం వహిస్తుందా?' శ్రీశ్రీ నిజంగానే గొప్ప కవి.. సోషలిజం వస్తుందా.. కమ్యూనిజం లేని సోషలిజం సాధ్యమా?.. ఈ ప్రభుత్వం పనికిరాదు. ఈ వ్యవస్థ పనికి రాదు.. ఈ సంఘం పనికిరాదు.. ఇదంతా మార్చి పారెయ్యాలంటే మార్పు కద్దుపడేవాళ్ళందర్నీ వూచకోతకోసి పారెయ్యాలి.. అంతేనా..? అదొక్కటే మార్గమా..? ఏమో.. విప్లవం.. నక్సలైటు.. జయప్రకాశ్ నారాయణ మార్గం సవ్యమా? ఏమిటిదంతా.. చివరికి ఏమౌతుంది..? రాజకీయాలు.. అరాజకీయాలు..

వచ్చాడు. కృష్ణారావొచ్చాడు. ఇంకో వ్యక్తి వచ్చాడు. మరో వ్యక్తి వచ్చాడు.

"గంటలో వస్తానని మూడు గంటలకా వచ్చేది?"

"హల్లో సార్! మీరెప్పుడొచ్చారు?"

వాళ్ళు కూడా పేకాట ప్రారంభించారు. కట్‌ఫర్ సీట్స్.. "నువ్వక్కడ.. మీర్కిడ.. జాక్ పాట్.. టెన్ ట్వంటీస్.. మీరే కలపాలి."

"ఏం సార్, మీరూ ఆడకూడదూ"?

"అంత స్టేక్‌తో నేనాడలేన్లెండి.. మీరాడుకోండి.."

ఆడుకుంటున్నారు.

ఏం తోచటం లేదు. ఏమిటోగా వుంది. గ్లూమీగా వుంది. పిచ్చిపిచ్చిగా వుంది. అనంతృప్తి.. బాధ.. కోరిక.. విచారం.. విషాదం.. ఇవన్నీ వున్నాయి. ఇవేమీ లేవు.. ఏమిటో, ఏమిటేమిటోగా వుంది. మనసనే మహారణ్యంలో ఆలోచనలనే అడివి జంతువుల విజృంభణ.. అల్లకల్లోలం.

ఆకలి.. కొంచెం ఆకలిగా వుంది.. మధ్యాహ్నం టిఫిన్ తినలేదు.. చంద్రుడు నిద్రగన్నేరు చెట్టెక్కి పైకి వచ్చాడు. వెన్నెల బావుంది. గాలి చల్లగా వుంది.. అయినా ఆనందంగా లేదు..

ఇంటి కెళ్తే బావుండును. వెళ్ళి అన్నంతింటే బావుండును. ఇల్లు.. ఇల్లాలు.. జానకేం చేస్తోందో..? పిల్లలకి అన్నాలు పెడుతూందేమో..! పాపం ఒక్కక్షణం తీరికుండదు.. సుఖం లేదు.

...నావల్ల సుఖపట్టంలేదు.. నేను సుఖపడ్తున్నానా? లేదు.. లేదు..

"ఏం సార్, మీకు బోర్ కొడ్తోందేమో...!"

"అబ్బే లేదులెండి.. పోతాను.. ఇంటికి పోతాను.."

"ఒక బీర్ తెప్పించమంటారా..?"

"వద్దు.. వద్దులెండి.. పోతాను."

"మమ్మల్నందర్నీ వదిలేసి ఆయనొక్కడికీ తెప్పిస్తానంటే ఆయన మాత్రమేమంటారు వద్దనక..?"

నవ్వులు.. సరసాలు.. హాస్యాలు.. పేకాట.

"పోతాను సార్ – పోతున్నానండీ.. వస్తా.. గుడ్ నైట్."

వచ్చేశాను.

కిందికి దిగి, రోడ్డు మీద పడ్డాను. ఇంటి దారి పట్టాను. ఇవ్వాళ సెలవు. షాపుల్లేవు. పాన్ షాపులున్నాయి. వైన్ షాపులున్నాయి. హోటళ్ళున్నాయి. బార్లున్నాయి. సినిమా హాళ్ళున్నాయి.

రోడ్డు మీద జనం రోజూ అంత ఎక్కువగా లేరు.

ఒక పెద్ద కుర్రాడూ, ఒక చిన్న కుర్రాడూ పేవ్‌మెంట్ మీద.. పెద్ద కుర్రాడు తాగాడు. తూలుతున్నాడు.

ఏదేదో వాగుతున్నాడు.

కాస్త ముందు.. ఒకమ్మాయీ.. అబ్బాయీ.. వైన్ షాపులో సీసాలు చాలా అందంగా వున్నాయి. మందుల షాపులో సీసాలకంటే బావున్నాయి.

ఈ అమ్మాయిని నే నెరుగుదును. సూపర్ బజార్లో పనిచేస్తుంది.. ఇది వరకు సన్నగా వుండేది. ఇప్పుడు లావయిందే..! అందంగా కనిపిస్తోంది. సెక్సీగా కూడా కనిపిస్తోంది. ఇది వరకు ఘోరంగా వుండేది. లావే అందమా..? మాంసపు కండలే అందమా..? అవే ఆకర్షణా..? అందమంటే ఏమిటసలు..? ఈ మాంసపు ముద్దల కోసం ఎంత తాపత్రయం..! వీటికెంత ప్రాధాన్యం...!

ఇంటికి వచ్చేశాను తలుపు తట్టాను.. తెరుచుకుంది.. మళ్ళీ ఇల్లు.. పిల్లలు.. పెళ్ళాం.. తిండి.. పడకలు.. సమస్యలు.. బాధలు.. పోట్లాటలు.. చిరాకులు.. మళ్ళీ యిల్లు..

"ఆకలేస్తోంది. అన్నం పెట్టు.."

"పిల్లలు తింటున్నారు.. వాళ్ళని తిననివ్వండి.. పెడ్తాను."

అన్నం.. భోజనం.. కూర బావోలేదు. కూరలు మండిపోతున్నాయి.. రోజూ మంచికూర లెక్కణ్నించి వస్తాయి? మజ్జిగ.. నీళ్ళు.. మజ్జిగ నీళ్ళు; మందెక్కువైతే మజ్జిగ పల్చన.. నీళ్ళు మాత్రం చల్లగా వున్నాయి. పోన్లే అవి చల్లగా వుండటంకూడా ఆనందించదగ్గ విషయమే.. భోజనం అయిపోయింది.. ఆకలి తీరింది.

"ఫాన్ చెడిపోయింది. కాస్త బాగుచేయించ కూడదూ?"

"చేయిద్దాం.."

"రేపయినా వాడి బాకీ తీర్చెయ్యాలి.. సాయంత్రం వచ్చి నానా గొడవా చేసి వెళ్ళాడు.."

"అప్పుకోసం రేపు మళ్ళీ ప్రయత్నిస్తాను."

"రేపు కరెంటు బిల్లూ.. వాటర్ బిల్లూ కూడా కట్టెయ్యాలి.."

"ఊఁ.."

"పెద్దాడు సినిమా కెళ్తానంటున్నాడు.. డబ్బులిస్తారా..?"

"ఇప్పుడు కాదు. నాల్రోజు లాగమను.."

"నా కట్టుడు చీరెలు సొంతం చిరిగిపోయాయి. కొనాలి..."

ఫిర్యాదులు.. ఫిర్యాదులు.. అవి లేవు.. ఇవి లేవు.. ఏవీ లేవు.. కొరత... కొరత.. కరువు.. ఏడుపులు.. ఎత్తిపొడుపులు.. రభసలు.. సమస్యలు.. సవాలక్ష సమస్యలు.. కన్నీళ్ళు.. డబ్బు డబ్బు – లేదు.. లేదు.

"పిల్లలంతా పడుకున్నట్టేనా?"

"ఏమో.. చిన్నాడింకా అటూ యిటూ దొర్లుతున్నాడు.."

"కాస్సేపిటు రాకూడదూ..?"

"నాకు వొంట్లో బాగాలేదు.. నన్ను విసిగించకండి."

కోరిక.. అనంతృప్తి.. రొటీన్.. బోర్.. మామూలే.. మామూలే.. జీవితంలో థ్రిల్ లేదు. ఈవెంట్ లేదు.. ఆనందం లేదు.. ఫ్లాట్‌గా.. రొటీన్‌గా.. ఇంతే.. ఇంతే..! కొత్తదనంలేదు.. సుఖం లేదు.. ఇంతే.. ఇంతే..!

ఏదన్నా చదువుకుంటే బావుండును. ఉక్కపోత.. చెమట.. గాలి లేదు.. బయటికెళితే...? ఆ రెండు గజాల స్థలంలోనే బయట మంచం.. తప్పదు.. ఇంతే.. ఇంతే..!

ఏం వద్దు.. నాకేం వద్దు.. కాస్త వెన్నెల నా మీద పడకూడదూ? ఒక్క చల్లటి గాలి తెర నా మీదికి విసరకూడదూ? కాసేపు వెల్లకిలా పడుకుని చూసుకోటానికి నాలుగ్గజాల ఆకాశమన్నా నాక్కనబడకూడదూ?

నిద్ర పోవాలి.. నిద్ర రాదేం..? నిద్ర పోవాలి.. లేచిందగ్గర్నుంచి మళ్ళీ ఆఫీసు.. మళ్ళీ సవాలక్ష పనులు.. శతకోటి సమస్యలు.. నిద్ర పోవాలి.. నిద్ర రాదేం..? నిద్ర పోవాలి.

O

*(అనామిక మాసపత్రిక – జూన్ 1975)*